# రహస్యం

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

ఆవిడ ప్రవర్తనలో ఒక పరివర్తన కలిగిందని చూసినవారు చాలా సులభంగా చెప్పొచ్చు. దానికి కారణం ఆతనిలోఉండే ఆత్మికశక్తి అనవచ్చును. మురళీధరుడు చాలా ఉదారస్వభావుడు. అతడు అప్పుడప్పుడు, భార్య చాలా ఉత్తమురాలని ఆమెను పొందినందుకు తాను ఎంతో అదృష్టవంతుడనని అనుకుంటూ గర్వపడుతూండేవాడు.

ఈ మనస్తత్వమే మనోరమలో మార్పు తేగలిగింది. భర్త ప్రశాంతమైన ముఖం చూసేసరికి ఆమె పట్టరాని ఆవేదన ఆనందం కూడా పొందేది. కారణం? అటువంటి గంభీర హృదయంలో తనకు స్థానందొరికిందని ఆనందం, భర్తకు చేసినమోసం జ్ఞాపకానికి వస్తే ఆవేదన కల్గుతూండేది.

ఆనాడు మురళీధరుడు భార్యకోసం మంచి గొలుసుకొన్నాడు. తాను తెచ్చిన వస్తువుతో భార్య పొందబోయే సంతోషాన్ని తలచుకుంటూ మురిసిపోతున్నాడు. లోపలకు తొందరగా వచ్చి "రమా, రమా," అన్నాడు.

ఆతడు ఆశ్చర్యపోయాడు. రమ నేల మీద పడుకునిఉంది. బుగ్గలనిండా కన్నీటి చారలు కన్పిస్తున్నాయి. ఆతనిలో ఆనందమంతా మాయమయిపోయింది. ఆతనికళ్లలో నీళ్లు తిరిగాయి. "రమా, ఏమి?" అన్నాడు మెల్లగా.

మర్నాటినుంచి, భార్యలో ఒకమార్పు కలుగుతోందని ఆతడు గ్రహించాడు. ఈ మార్పుకు కారణం తానైఉండాలి. ఆమెకేదైనా దుఃఖం కల్గిస్తున్నానా అని విచారించాడు. పెళ్లయి రెండునెలలైనా కాలేదే? ఇంతలోనే? ఈమార్పుకు కారణం తెలుసుకుందామని చాలాసార్లు ప్రయత్నించేడు. కాని ఆమె చెప్పలేకపోయింది. అతనిలోకూడా ఒక మార్పు కలిగింది. ఇద్దరిలో ఉత్సాహం పోయింది.

కారణం తెలియకపోతే ఆతడు కృశించిపోతాడు. తనవల్ల తనభర్తకు కష్టంకలిగింది. ఆమె గ్రహించింది.

ఆనాడు అతడు ఒంటరిగా కూర్చుని ఉన్నాడు. పైని కారుమబ్బులు, చిమ్మచీకటి—హోరుసవర్షం — ఆమె దగ్గరగావచ్చి కూర్చుని ఏడ్చింది. ఆతడుకూడా దుఃఖం పట్టలేకపోయాడు. ఆమె క్షమించమంది. "తాను కడుపుతో ఉన్నదని దానికి ఆధారం' భర్త కాదని...' చెప్పలేక ఏడిచింది.

ఆతని ముఖం వికసించింది. "ఇంతేనా?" అన్నాడు—పైని కారుమబ్బులు విడిపోయినాయి. వర్షం వెలిసింది—వెన్నెల వ్యాపించింది.

(నా "స్త్రీ హృదయం" నుంచి)